నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు

# నిరంకుశ విధానాలపై పోరాటం

## 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
## ఐక్యకార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక నిరంకుశ వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు నిర్వహించి కార్మికుల సత్తా చూపించాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో సోమవారం నాడు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ నుంచి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, తాడిపత్రి బస్టాండ్ మీదుగా శ్రీకంఠం సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం వైఎస్సార్ టియు జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం దుర్మార్గం అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల పని గంటలను సైతం పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు మున్సిపల్, అంగన్వాడీ, ఆశా తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కనీసం నిరసన చేసేందుకు కూడా వీల్లేకుండా బిజెపి ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంభిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్తూ అదానీ, అంబానీ జపం చేస్తోందని విమర్శించారు. ఈ చర్యలను నిరసిస్తూ 9వ తేదీన చేపట్టిన దేశవ్యాప్తం సమ్మెలో కార్మికులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ప్రసాద్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ తిరుమలేష్, గోపాల్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసింహా, వరలక్ష్మి, ఇంజినీర్ సెక్షన్ విభాగం నాయకులు సంజీవ రాయుడు, మల్లికార్జున, పోతులయ్య పాల్గొన్నారు.

# భూ నిర్వాసితుల నిరీక్షణ..!

◆ ఏళ్లు గడుస్తున్నా అందని పరిహారం
◆ హంద్రీనీవా నిర్వాసితుల ఎదురుచూపు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

హంద్రీనీవా భూ నిర్వాసితులకు ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. సంవత్సరాల తరబడి పరిహారం కోసం రైతులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. ఎప్పటికి భూ పరిహారం లభిస్తుందో తెలియలేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా హంద్రీనీవాను పూర్తి చేస్తామన్న ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. కొంతమేరకు పనులు చేయడం ఆ తరువాత నిలుపదల చేయడం జరుగుతూనే వస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూమికి మాత్రం రైతులకు పరిహారం అందటం లేదు.

**3527 ఎకరాలకు అందని పరిహారం**

హంద్రీనీవా మొదటి దశ కింద భైరవానితిప్ప, అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల పథకంతోపాటు, అమిద్యాల బ్రాంచ్‌కెనాల్, 33, 34, 36 ప్యాకేజీలున్నాయి. వీటన్నింటి పరిధిలోనూ భూసేకరణలు పెండింగ్‌లో ఉన్నాయి. భైరవానితిప్ప, పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. భూసేకరణ చేసి పనులు ప్రారంభిస్తామని ప్రకటించింది. భూసేకరణ మాత్రం చేయలేదు. 2023లో భూసేకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్టు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. ఆ డబ్బులు కూడా పూర్తి స్థాయిలో పడలేదు. కొంత భూసేకరణ ఆగింది. ఇప్పుడు కూడా ఇంకా భూసేకరణకు నిధులు మంజూరవలేదు. దీంతో ప్రాజెక్టు ముందుకు పోవడం ఆగమ్యగోచరంగానే ఉంది. ఈ పనులన్నింటికీ కలిపి 9500 ఎకరాలు భూసేకరణ అవసరమవుతుంది. ఇప్పటి వరకు 4808 ఎకరాలు సేకరించారు. ఇంకా 3524 ఎకారల భూసేకరణపై ప్రాజెక్టుల పరిధిలో చేపట్టాల్సి ఉంది.

| ప్రాజెక్టు పేరు | భూసేకరణ అవసరం | సేకరించినది | ఇంకా సేకరించాల్సినది |
|---|---|---|---|
| అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు | 2729 | 988 | 1508 |
| భైరవానితిప్ప ప్రాజెక్టు | 1406 | 789 | 617 |
| పంప్‌హౌస్‌కు | 120 | 00 | 120 |
| ఆమిద్యాల బ్రాంచ్ కెనాల్ | 80 | 69 | 09 |
| గుంతకల్లు చెరువులకు | 230 | 00 | 230 |
| ప్యాకేజీ33 | 1224 | 1203 | 49 |
| ప్యాకేజీ 34 | 1267 | 1009 | 157 |
| ప్యాకేజీ 35ఎ | 1175 | 00 | 1175 |
| ప్యాకేజీ 36 బి | 460 | 00 | 460 |
| **మొత్తం** | **9500** | **4808** | **3524** |

**ఈ ప్రభుత్వంలోనైనా పరిహారం అందేనా.?**

కూటమి ప్రభుత్వం హంద్రీనీవా పనులను తమ కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ కాలంలోనైనా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తారన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ మేరకు కూటమి నేతలు కూడా తాము ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటనలు చేస్తున్నారు. కొంతవరకు పనులు కూడా మొదటి, రెండో దశలోనూ నడుస్తున్నాయి. అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు, బిటిపి ఎత్తిపోతల పనులు ప్రారంభించనున్నట్లు కూడా నేతలు చెబుతున్నారు. దీంతో రైతులు తమ నిరీక్షణ ఫలిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

## వైభవంగా పాండురంగస్వామి రథోత్సవం

స్వామి వారి ఉత్సవవిగ్రహాల ఊరేగింపు..

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ఆషాడ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో పాండురంగ స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా అలంకరించిన పాండురంగ స్వామి, రుకుమాబాయి ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి స్థానిక బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పాండురంగస్వామి ఆలయం నుంచి బళ్లారి రోడ్డు, వినాయక కూడలి మీదుగా కోటలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం వరకూ అక్కడి నుంచి కూరగాయల మార్కెట్, ఓబుళాచారి రోడ్డు మీదుగా ఆలయం వరకూ ఊరేగించారు. కార్యక్రమంలో కాలవ భరత్, ఎపి స్వకుల శాలి సమాజ అధ్యక్షులు కామ్లే నగేష్, తెలంగాణ స్వకులశాలి సమాజ అధ్యక్షులు కామ్లే రామలింగేశ్వర్, పాండురంగ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు కెబి.మురళి, రాయదుర్గం స్వకులశాలి సమాజం అధ్యక్షులు వెంకటేశులు, అనంతపురం అంబా భవానీ ఆలయ ధర్మకర్త జెవి.సురేష్‌బాబు, శ్రీశైలం నిత్యాన్నదాన సత్ర కమిటీ ఉపాధ్యక్షులు తుకారాం, అనేకమంది సమాజ బంధువులు, పాల్గొన్నారు.

## నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మాజీ ఎంపీ తలారి రంగయ్య అధ్యక్షతన మంగళవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక గోపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వైసిపి మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లా డుతూ ఈ నెల 8వ తేదీ వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నేడు రైతులతో గ్రామసభ

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయనున్న కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వదలచిన రైతులతో మంగళవారం కంబదూరులోని గ్రామ సచివాలయం-1లో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బాలకిషన్ తెలిపారు. ఆ సభలో కంపెనీల ఏర్పాటుపై రైతుల అభిప్రాయాలు సేకరిస్తారని తెలిపారు. ఆసక్తి కల్గిన రైతులు ఆధారాలతో సహా హాజరు కావాలని ఆయన సూచించారు.

## ఘనంగా మొహర్రం సంబరాలు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో హిందూ, ముస్లింలు మొహర్రం సంబరాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. చాలా గ్రామాల్లో సోమవారం పెద్ద సరిగెత్తు పూజలు నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించి, మొక్కు తీర్చుకున్నారు. రాత్రి గ్రామాల పురవీధుల్లో పీర్లను ఊరేగించారు.

ప్రత్యేక అలంకరణలో పీర్లస్వాములు

# మాటిచ్చాం.. నెరవేరుస్తున్నాం..!

◆ ఉరవకొండ అభివృద్ధికి సేవకుడిగా పనిచేస్తా ◆ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎన్నికల ముందు మాటిచ్చామని, ఈ మేరకు హామీలను నెరవేరుస్తున్నామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సోమవారం పట్టణంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కోసం ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.22 కోట్లతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకంలో భాగంగా 16.35 కోట్ల రూపాయల నిధులతో కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకు నిర్మించిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల్లో తాగునీటి పథకం పనులను పూర్తి చేశామన్నారు. గతంలో ఉరవకొండ పట్టణంలో 15 రోజులకి ఓ సారి నీళ్లు ఇచ్చే విధానం చూసామని, గడిచిన ఐదేళ్లలో ఒక మీటర్ పైప్ లైన్ కూడా వైసిపి నాయకులు వేయలేకపోయారన్నారు. పీఏబీఆర్ డ్యాం నుంచి ఉదిరిపికొండకు గతంలోనే పైపులైను వేస్తే, ఉదిరిపికొండ నుంచి దాదాపు 17 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఉరవకొండ సంపులోకి నీళ్లు తీసుకువచ్చామని, ఇక్కడి నుంచి పట్టణానికి నీటి సరఫరా చేస్తామన్నారు. ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధికి సేవకుడిలా పని చేస్తానన్నారు. ఉరవకొండ పట్టణంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, డిఈ సప్రిన్, ఏఈలు ఐజయ్య, దివ్య, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రామిప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ మండలం పిఎబిఆర్ వద్దనున్న రక్షిత మంచినీటి పథకం పంపురూమ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పి1, పి2, పి3 (ఒక్కోటి 350 హెచ్‌పి కెపాసిటీ కలిగిన) మోటార్లను మంత్రి పయ్యావుల కేశవ్ ప్రారంభించారు. పంప్ హౌస్‌లో నీటి శుద్ధిని పరిశీలించారు. నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు.

# ప్రతిష్టాత్మకంగా 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్'

## కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమంపై జిల్లా, మండల, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాక్షులను (విట్ నెస్) పాఠశాల వారీగా సచివాలయ సిబ్బందిని సరి చూసుకోవాలని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఈ ప్రక్రియపై ఎంపీడీవోలు బాధ్యత వహించాలన్నారు. సాక్షులుగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉండరాదన్నారు. థర్డ్ పార్టీ ఉండాలన్నారు. ఇప్పటివరకు 2,420 పాఠశాలలకు 1,616 రిజిస్ట్రేషన్ చేయగా, 804 పాఠశాలల్లో సాక్షుల నమోదు పెండింగ్ ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో 100 శాతం సాక్షుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ప్లాంట్ రిజిస్ట్రేషన్ల స్టాటస్‌కు సంబంధించి 4 నుంచి 10వ తరగతి వరకు జిల్లాలో 2,306 పాఠశాలలు ఉండగా, ఇప్పటివరకు 1,358 పాఠశాలల్లో ప్లాంట్ రిజిస్ట్రేషన్లను పూర్తి అయ్యిందని, మిగిలిన పాఠశాలల్లో ఈ ప్రక్రియను మంగళవారం ఉదయంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల చేత జాగ్రత్తగా మొక్కలు నాటించాలని సూచించారు. కామన్ మీటింగ్ ఎజెండాలో భాగంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన 30 సెకండ్ల వీడియో, రెండు ఫొటోలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా హార్టికల్చర్ ప్లాంటేషన్ నిర్వహణను పూర్తి స్థాయిలో చేయాలన్నారు. జిల్లాలో రెండు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఎఫ్ఒ విగ్నేష్ అప్పావు, డీఈవో ప్రసాద్ బాబు, డివిఇఒ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

## స్పోక్ సెంటర్‌తో యువతకు ఉపాధి అవకాశాలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

రతన్ టాటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జేఎన్టీయూలో ఏర్పాటు కాబోతున్న స్పోక్ సెంటర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ సుదర్శన్ రావ్‌తో సోమవారం సమావేశం అయ్యారు. అనంతపురం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో వీసీతో ఇందుకు సంబంధించిన పలు అంశాల గురించి చర్చించారు. ఇప్పటికే స్పోక్‌కు ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు విడుదల చేసింది. సెంటర్ ఏర్పాటుపై ఎమ్మెల్యే దగ్గుపాటి చర్చించారు. ఎక్కువ మంది యువతకు అవకాశం కల్పించే విధంగా ఈ సెంటర్ ఉండాలని విసిని ఎమ్మెల్యే కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఈ స్పోక్ ఒక కేంద్రంగా పనిచేయనుందని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

## వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శికి సన్మానం

**రాయదుర్గం :** వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మెట్టు విశ్వనాథరెడ్డిని సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని మెట్టు క్యాంప్ కార్యాలయం వద్ద వైసిపి యువ నాయకులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డిను నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మగట్ట మండల ఎంపీపీ భవాని, మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతరెడ్డి, కెపి.దొడ్డి సర్పంచి రమేష్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం

## కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

వినతులను అందజేస్తున్న అర్జీదారులు

**ప్రజాశక్తి-పామిడి**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియ జేశారు. పామిడి మండల కేంద్రం జగన్నాథ పద్మావతి ఫంక్షన్ హాల్ సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఒ మలోలతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 567 అర్జీలను ప్రజలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా, అర్థవంతంగా పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యపై పదేపదే వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్డీసీలు మల్లికార్జున, తిప్పేనాయక్, ఆనంద్, రామకృష్ణా రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ జెడి ఉమా మహేశ్వరమ్మ, పామిడి తహశీల్దార్ షర్మిల, ఎంపీడీవో తేజోష్ణ, కార్మిక సంక్షేమ బోర్డు అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, గుంతకల్ డీఎస్పీ శ్రీనివాస్, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, సిఐ యుగంధర్, మండల విద్యుత్ అధికారి మధుసూదన్ రావు, పామిడి పంచాయతీ సెక్రటరీ అశ్వర్థ నాయుడు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిగా అసిస్టెంట్ కలెక్టర్

## కణేకల్లులో బాధ్యతలు చేపట్టిన సచిన్‌రహార్

పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న సచిన్ రహార్

**ప్రజాశక్తి -కణేకల్లు**

14 రోజుల శిక్షణలో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ సోమవారం స్థానిక 1వ సచివాలయంలో మేజర్ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయనకు తహశీ ల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ విజయ్‌సింహారెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి నిర్మల పూలబొకేలు ఇచ్చి శాలువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వోలు పవన్‌కుమార్, రుద్రప్ప, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, 4వ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ సెక్రటరీల నియామకం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

కంబదూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా ఆ గ్రామ పంచాయతీలకు సెక్రటరీలను నియమించినట్లు ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. ములకనూరు, కంబదూరు పంచాయతీలకు మహేష్ బాబు, పాల్లూరు, నూతిమడుగు, కర్తనపర్తిలకు సురేష్, గొల్లపల్లి, మర్రిమాకులపల్లిలకు భానుప్రకాష్, రాంపురం, తిమ్మాపురంలకు రఘునాథ్‌రెడ్డి, రాళ్లఅనంతపురం, చెన్నంపల్లి, కురాకులపల్లి గ్రామాలకు అశ్వర్థరెడ్డిలను నియమించినట్లు తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ ప్రజలు ఈ విషయాన్ని గమనించి వారి సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

## 1.709 కిలోల గంజాయి స్వాధీనం

### పదిమంది అరెస్ట్

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పోలీసులు సోమవారం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో రైల్వే గేటు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్నాటక నుంచి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న పది మంది ముఠాను అదుపులో తీసుకుని వారి నుంచి 1.709 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జయానాయక్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలో గంజాయి అక్రమ రవాణా, చెలామణి ముఠా సంచరిస్తున్నట్లు సమాచారం ఉండటంతో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి ముఠా పట్టుబడినట్లు సిఐ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది బళ్లారిలో రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద సాధువుల నుంచి గంజాయిని కిలో రూ. 25 వేల చొప్పున కొనుగోలు చేసి బళ్లారి నుంచి రైలులో రాయదుర్గం వచ్చి అక్కడి నుంచి రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరి నుంచి గంజాయి, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జయానాయక్ తెలిపారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సిఐ జయానాయక్

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిపిఎం నాయకులు

## స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలను
# రద్దు చేయాల్సిందే

### సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి-సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లతోపాటు ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని నీలిమా ట్యాకీస్, 1, 2వరోడ్డు, ద్వారకానగర్‌లో విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా సిఎం చంద్రబాబు ఫిర్యాదులు చేసేలా క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం వి.రామిరెడ్డి మాట్లాడుతూ సెకీ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు భారాలపై ప్రభుత్వానికి అర్జీ పెట్టాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాకముందు ప్రస్తుతం మంత్రి నారా లోకేష్ ఎవరికైనా స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులగొట్టండి.. అని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చాక అవే ఆదేశాలను అమలు చేయడం బాధాకరమన్నారు. అలాగే విద్యుత్ ఛార్జీలను పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం కమర్షియల్ కనెక్షన్లకు బిగిస్తున్నారని, రానున్న రోజుల్లో ఆపార్ట్‌మెంట్లకు బిగించడానికి సిద్ధం చేస్తున్నారన్నారు. తర్వాత రైతుల మోటార్లకు బిగిస్తారని వివరించారు. ఫలితంగా విద్యుత్ భారం పెరుగుతుందన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మోటార్ల బిగింపు, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, ప్రకాష్, జీవ, ఫక్రు, రఫీ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

**ప్రజాశక్తి-పామిడి**

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

స్థానిక గుత్తి రోడ్డులోని ఓ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలు సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం మండల అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి ముత్యాలు మాట్లాడుతూ పామిడి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే కూలీలందరికీ పనులు కల్పించాలని, పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్, కొండాపురం కుమార్, సాషు, గజినాంపల్లి వెంకటేష్, రామాంజనేయులు, శంకర్, ఈశ్వరయ్య, రాజు, నాగరాజు, చౌడప్ప, నాగయ్య, నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## కంపచెట్లతో నిండిన 'వెలుగు'

### అపరిశుభ్రంగా కార్యాలయ వాతావరణం

**ప్రజాశక్తి-యల్లనూరు**

కంపచెట్లతో నిండిన వెలుగు కార్యాలయం

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం కంపచెట్లతో నిండిపోయింది. కార్యాలయం ఆవరణ మొత్తం చెత్త, చెదారం, ముళ్ల కంపలతో ఉంటోంది. దీనికితోడు కార్యాలయంలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో సిబ్బంది, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కార్యాలయానికి వచ్చే డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు మరుగుదొడ్లు, నీటి కొళాయిలు వంటివి లేకపోవడంతో వారి అగచాట్లు వర్ణణాతీతం. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఈ దుస్థితి వస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించినా ఆమె ఆదేశాలను పెడచెవిన పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో కనీస మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

## ఆలూరు సాంబశివారెడ్డికి అభినందనలు

**ప్రజాశక్తి-శింగనమల**

ఆలూరు సాంబశివారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న శింగనమల వైసిపి నాయకులు

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆలూరు సాంబశివారెడ్డికి సోమవారం అభినందనలు వెల్లువెత్తాయి. పదవి వచ్చాక జిల్లాకు మొదటిసారి వచ్చిన ఆయనకు నియోజవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు భారీగా అనంతపురంలోని ఆయన నివాసానికి చేరుకుని బొకేలు ఇచ్చి, పూలమాలలు వేసి అభినందించారు. అభినందనలు తెలిపిన వారిలో వైసిపి నాయకులు కన్నంపల్లి నరేందర్‌రెడ్డి, వీరాంజనేయులు, చెన్నకేశవులు, శ్రీనివాసులు నాయక్, ఎన్‌వి నారాయణ, నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొకే అందజేస్తున్న పుట్లూరు వైసిపి నాయకులు

**పుట్లూరు :** అనంతపురంలోని ఆలూరు సాంబశివారెడ్డి నివాసంలో మండల వైసిపి నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో ఎంపిపి రాఘవరెడ్డి, జిల్లా కార్యదర్శి రమణయాదవ్, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామంజులరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వెంకట్రామిరెడ్డికి సన్మానం

**యాడికి :** వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన మాజీ జెడ్పీటీసీ, వైసీపీ సీనియర్ నాయకులు వెన్నపూస వెంకట్రామిరెడ్డిని సోమవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, మండల కన్వీనర్ సంజీవరాయుడు, చందా చౌడయ్య, జూటూరు భాస్కర్‌రెడ్డి, మక్కల రామాంజి, పిన్నేపల్లి శేఖర్‌రెడ్డి, కోడూరు సుబ్బారెడ్డి, నిమ్మర్తి మల్లికార్జున, ఎరుకలప్ప, పూలతోట రామాంజి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సుంకిరెడ్డి తాత మృతి

**శింగనమల :** మండలంలోని పెద్దమట్లగొంది గ్రామం వద్ద వెలసిన రామయ్య తాత గారి శిష్యుడు, పూజారి సుంకిరెడ్డి తాత (67) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. తెల్లవారుజామున ఆయనకు ఛాతీలో నొప్పి రాగా కుటుంబ సభ్యులు వెంటనే శింగనమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పలువురు భక్తులు ఆయన నివాసానికి చేరుకుని పూలమాలలు వేసి అంజళి ఘటించారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే : సిఐటియు

**ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్**

### మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల బైక్ ర్యాలీలు

అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే అని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా స్థానిక నగరపాలక సంస్థ నుంచి ప్రెస్‌క్లబ్ వరకూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పట్టించుకోలేదన్నారు. అనేక దఫాలుగా ఆందోళన చేస్తూ అధికారులు, మంత్రులు చుట్టూ తిరుగుతున్నా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వతేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, పారిశుధ్య కార్మికుల యూనియన్ నగర కార్యదర్శి, తిరుమలేశు, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, కోనప్ప, లక్ష్మి, శివన్న, సుబ్బిరెడ్డి, రవికిరణ్, వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామిరెడ్డి కార్మికులకు రూ.5 కోట్ల నిధులు ఇవ్వాలి

### మంత్రి పయ్యావులను కలిసిన సిఐటియు నేతలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ నిధులు రూ.5 కోట్లు విడుల చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతి అందజేశారు. జిల్లాలో 620 మంది కార్మికులు 950 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారని తెలిపారు. వారికి నెల నెల వేతనాలు సకాలంలో చెల్లించడం లేదని, వేతనాల కోసం రోడ్లపై వచ్చి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. నిధులు విడుదల చేశామంటూ మంత్రి పయ్యావుల కేశవ్ సిఐటియు నేత ఓబులకు తెలిపారు. అయితే నిధులు వచ్చిన మాట వాస్తవమే అని అందరికి రాలేదన్నారు. ఫేస్ 1 డ్యాం లో పని చేసే కార్మికులకు బెలుగుప్ప కార్మికులకు బకాయిపూర్తి గా పడలేదన్నారు. ఫేస్ 4 కార్మికులకు, పాక్షికంగా పడ్డాయని, బకాయిలన్ని అలాగే ఉన్నాయని తెలిపారు. దీని పై రివ్యూ చేసిన తరువాత ఎప్పుడూ నిధులు విడుదల చేసేది తెలుపుతామని మంత్రి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు ఆర్.ఎర్రిస్వామి, హెచ్.వన్నూర్ స్వామి, బి.తిప్పేస్వామి, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

## 'కూటమి'తోనే అభివృద్ధి సాధ్యం

### ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి-పామిడి**

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్‌తో కలిసి సోమవారం మండల కేంద్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమంతోపాటు అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఆయా పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఇది జీర్ణించుకోలేని వైసిపి నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. అంతకుముందు పట్టణంలోని భావసార క్షత్రియ ఆలయంలోని విఠోబా రుక్మిణి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల్లోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు కత్రిమల ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాసులురెడ్డి,గౌస్, జింకల సంజీవ, బొమ్మా మోహన్, సురేష్‌రెడ్డి, కరూరు శివశంకర్, చిలకల రాజగోపాల్, శీన, రామాంజి, రాజు, శివశంకర్, పెరమసాని రామాంజి, రంగస్వామి, మండ్ల రాజు, వీరారెడ్డి, తిమ్మప్ప, అప్పన్నగారి కుమార్, శ్రీరాములు, అనుంపల్లి శీన, అబ్దుల్‌ఖాదర్, తేల్ బాషా, రామయ్య, మస్తానయ్య, గోమాతి శంకర్, శర్మాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కలెక్టరేట్ :** జిల్లాను ఆటోమొబైల్, సోలార్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలోని 19వ డివిజన్ సాయినగర్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజనేయులు, డివిజన్ నాయకులు లక్ష్మీదేవమ్మ, ఓబుల్‌రెడ్డి, కోనంకి గంగారం, గడ్డం సుబ్రమణ్యం, తలారి ఆదినారాయణ, జెఎల్ మురళీధర్, రాయల్ మురళి, సింగవరం రవి, గౌస్‌మోదీన్, పరమేశ్వర్, కొండన్న, సరిపూటి రమణ, నాగన్న, కృష్ణకుమార్, కుంచపు వెంకటేష్, దళవాయి వెంకటనారాయణ, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్‌యాదవ్, సంగా తేజస్విని, గుర్రం నాగభూషణం, మోహన్‌కుమార్, ఫిరోజ్‌అహ్మద్, మున్వర్, స్వామిదాసు, గోపాల్ గౌడ్, మనోహర్, సరళ, మల్లెల దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### సిఐటియు ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

**ప్రజాశక్తి-గుంతకల్లు**

గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం పట్టణంలోని బైకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్థానిక హంపిరెడ్డి భవనం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం, ఎన్టీఆర్ సర్కిల్, మార్కెట్ మీదగా, పాత గుంతకల్లు, టీవీ స్టేషన్ కూడలి వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జగదీష్, నాయకులు బి.శ్రీనివాసులు, మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, బాషా, పీరా, తిమ్మప్ప, సురేంద్ర, షబ్బీర్, రామునాయక్, రంగనాయకులు, హరి, రవి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెను జయప్రదం చేయండి**

ఈనెల 9న కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల నేతృత్వంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్యకర్తలు, కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్రబాబు, సభ్యులు రామునాయక్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

**రాప్తాడు :** ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన పోస్టర్లను సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రైతుసంఘం మండల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అంగన్వాడీ కార్మికులు సావిత్రి, భారతి, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ, హమాలీలు సుబ్బారావు, ప్రతాప్, ప్రకాష్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## జలధికి తరలిన పీర్లు

**శింగనమల :** మొహర్రం వేడుకల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో వెలసిన పీర్లు జలదికి తరలివెళ్లాయి. ముందుగా స్థానిక గొల్లవీధిలో వెలసిన అక్బర్ స్వామి మకాన్ వద్దకు మసుద్‌స్వామి దర్గాలో వెలసిన పీర్లు వచ్చి సలామ్ చేశాయి. అక్కడ ప్రత్యేక చదివింపులు చేశారు. అనంతరం పురవీధుల గుండా మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగితూ పీర్లు జలదికి తరలాయి.

**గుత్తి :** కుల,మతాలకు అతీయితంగా జరిగే మొహరం వేడుకలు మండల వ్యాప్తంగా సోమవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బారే ఇమాం, పగ్గాలు పీరు, పీరా హుస్సేన్ పీర్ల ను ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా పీర్లకు భక్తులు చక్కెర చదివింపులు నిర్వహించారు. పట్టణంలో ఊరేగింపు అనంతరం పీర్లు జలదికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె. సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పెద్దపప్పూరు :** మొహర్రం వేడుకల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని పెద్దయక్కలూరు, వెంగంపేట గ్రామాల్లో పీర్లస్వాములు జలదికి తరలాయి. ఇందులో భాగంగా పీర్లస్వాములను మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగించారు.

ఎద్దపప్పూరులో జలదికి తరలుతున్న పీర్లు

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు తగదు

**శింగనమల :** ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసిపి నేతల అనుచిత వ్యాఖ్యలు తగదని ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. శింగనమల నియోజకవర్గ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై రాజకీయాలకు సంబంధం లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే వైసిపి అధినేత జగన్ మాత్రం ఎక్కడో తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని ఇసుక అక్రమ రవాణాపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇందుకు ఆ పార్టీ జిల్లా నేతలు కూడా ఆయన మాటలను సమర్థించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి విషపు మాటలు నిరూపించే దమ్ముందా.. అని ప్రశ్నించారు. మీ హయాంలో ఇసుక మాఫికా అక్రమంగా రవాణా చేసి కోట్లు దండుకుందని విమర్శించారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని సిఎంపై ఇలాంటి చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

మొక్కలు నాటుతున్న శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి, విద్యార్థులు

## శ్రీచైతన్యలో 'గ్రీన్ ఇండియా'

**ప్రజాశక్తి-అనంతపురం**

నగరంలోని కమ్మ భవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య మేనేజ్మెంట్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ ప్రారంభించడం గొప్ప అనుభూతిని కలిగిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, డీన్‌లు చిన్న కృష్ణారెడ్డి, భవిత, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, పిఇటిలు రవిరాజ్, విజయ, ఎఒ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ ఎఒకు సన్మానం

ఎఒ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చిల్లబండ్ల పెద్దన్న అధ్యక్షతన పదవీ విరమణ పొందిన పరిపాలన అధికారి పి.దామోదరయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దామోదరయ్య నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేశారన్నారు. అనంతరం దామోదరయ్య దంపతులకు శాలువాలు, కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు పెద్ద తిప్పయ్య, జిల్లా కార్యదవైర్శి బి.మల్లికార్జున, వైస్ ఎంపిపి పుష్పావతి, ఎఒ పృథ్వీసాగర్, ఎపిఒ మురళీకృష్ణ, హౌసింగ్ ఎఇ గోపీచందునాయక్, సర్పంచులు రామ్మోహన్‌చౌదరి, రామిరెడ్డి, పెద్దన్న, శివ, పంచాయతీ సెక్రటరీలు శివరంజని, ఉమాదేవి, ఎంపిటిసిలు, టిఎలు, ఎఫ్ఎలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కీటక జనిత వ్యాధుల నియంత్రణపై శిక్షణ

**ప్రజాశక్తి-అనంతపురం**

మాట్లాడుతున్న ఓబులు

నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ భవనంలో జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబులు అధ్యక్షతన సోమవారం కీటక జనత వ్యాధుల నియంత్రణపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ జిల్లాలో రానున్న కాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే గ్రామాల్లో దోమకాటు వల్ల సంభవించే వ్యాధులు ప్రబలకుండా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాల్లో హెల్త్ అసిస్టెంట్లు పర్యటించి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒలు గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, బత్తుల కోదండరామిరెడ్డి, రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, మునాఫ్, తిరుపాలయ్య, ఎస్.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్‌టియులో ఇఎపిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

**అనంతపురం :** అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవనంలోని ఎపిజె అబ్దుల్‌కలాం బ్లాక్‌లో 2వఫ్లోర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా శాఖ, ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఎపి ఇఎపి సెట్ హెల్ప్ లైన్ సెంటర్ 2025ను ప్రారభించినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. ఎపిజె అబ్దుల్‌కలాం బ్లాక్ రెండవ ఫ్లోర్ బిల్డింగ్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించాలని కోరారు.

## 10న మెగా పేరెంట్స్ సమావేశం

**నార్పల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 10న గురువారం కళాశాల ఆవరణములో మెగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బాలప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కచ్చితంగా హాజరు కావాలని కోరారు.

## పుట్లూరు ఇఒఆర్‌డిగా శివప్రసాద్

**పుట్లూరు :** మండల ఇఒఆర్‌డిగా శివప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన జిలాన్‌బాషా ఉద్యోగోన్నతిపై కళ్యాణదుర్గం వెళ్లారు. కడపలో విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ పుట్లూరు ఇఒఆర్‌డిగా బదిలీ ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

## కార్మికులకు చీరలు పంపిణీ

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి, ఆర్‌ఎంఒ డాక్టర్ జి.హేమలత సమక్షంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటరీ మహిళా కార్మికులకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు, మహాలక్ష్మి టెక్స్‌టైల్స్ అమ్మ నెనుబాయ్ త్రిలోక్ చంద్ మరణించి నెలరోజులు పూర్తి అవుతున్న చీరలకు ఆర్థికసాయం చేసినట్లు నిర్మలమురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిపల్లవి, నాగరాజు, రాము, సరస్వతి, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టుఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి, ఆర్‌ఎంఒ డాక్టర్ జి.హేమలత

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**బెలుగుప్ప :** మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన హరిజన తిప్పేస్వామి (52) కనేకల్ మండలం గోపాలపురం వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తిప్పేస్వామి ద్విచక్ర వాహనంపై పుల్లంపల్లికి పీర్ల పండుగకు వెళ్లి స్వగ్రామం ఎర్రగుడికి వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య శ్యామల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతిచెందిన వ్యక్తికి టిడిపి నాయకులు సంతాపం తెలిపారు.

### బి.పప్పూరులో చైన్ స్నాచింగ్

**నార్పల :** మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో సోమవారం ఉదయం గ్రామ బస్టాండ్ వద్ద చైన్‌స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన కమ్మ పుష్ప మెడలోని 2.5 తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పల్సర్ మోటార్ వెహికల్‌లో వచ్చి లాక్కెళ్లినట్లు బాధితురాలు వాపోయింది.